
చంద్రబాబు అభివాదం





నల్లజర్ల రైతన్నా - మీ కోసం సభలో నులక మంచంపై కూర్చుని రైతుల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు చిత్రంలో మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మద్దిపాటి, కలెక్టర్ కీర్తి, బాపిరాజు

నేనున్నా!

అండగా ఉంటా.. ఆదుకుంటా

- చెట్టు కింద.. నులక మంచంపై సీఎం సభ
- హంగూ ఆర్భాటం లేకుండా నిర్వహణ
- రైతుల సమస్యలు విన్నారు..
- సలహాలు స్వీకరించారు..
- మీరు చెప్పింది చేస్తా అంటూ భరోసా
- నల్లజర్లలో చంద్రబాబు సభ సక్సెస్

(రాజమహేంద్రవరం/నల్లజర్ల/గోపాలపురం/కొవ్వూరు/ దేవరపల్లి - ఆంధ్రజ్యోతి)

మీ సమస్యలు చెప్పండి.. వింటా.. పరిష్కరిస్తా.. అంటూ సీఎం చంద్రబాబు రైతులతో కలిసిపోయారు.. నల్లజర్లలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో సాధారణ నులక మంచంపై కూర్చుని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా సీఎం చంద్రబాబు చెట్టుకింద కూర్చుని రైతులు చెప్పింది ఆసక్తిగా విన్నారు.. సూచనలు.. సలహాలు స్వీకరించారు.. మీరు చెప్పింది నేను చేస్తా అంటూ వారి భరోసానిచ్చారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల జాతీయ రహదారికి సమీపాన బుధవారం జరిగిన రైతన్నా-మీకోసం కార్యక్రమం ఎవరూ ఊహించని విధంగా సభ ఏర్పాటు చేశారు. ఆరంభం నుంచి చివరి వరకూ వినూత్నంగా.. ఆసక్తిగా జరిగింది. ఉదయం 12 గంటలకు ఆరంభమైన చంద్రబాబు పర్యటన సాయంత్రం ఐదు గంటల వరకూ సాగింది. మొదట ఒక రైతు పొలంలో వేసిన వివిధ పంటలను సీఎం స్వయంగా పరిశీలించారు.ఒకేచోట వివిధ రకాల మొక్కలు పెంచడంపై ఆరా తీశారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఐదు స్టాల్స్‌ను తిలకించారు.ఆ స్టాల్స్‌లో వస్తువుల గురించి అధికారులు వివరించగా ఆయన విని.. వారిని అభినందించారు. రెండు గంటల సమయంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ పోతవరం రోడ్డు సమీపంలో ఓ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలతో సమీక్షించారు.తొలుత చంద్రబాబు భూగర్భజలాలు, పంటల మార్పిడి, ఆదాయం, యంత్రాల వినియోగం, లాభ సాటి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పంటల సాగు వంటి వాటి గురించి ప్రస్తావించారు. సభ ఏర్పాట్లు బాగా చేసినందుకు కలెక్టర్ కీర్తి చేకూరిని, నియోజకవర్గంలో బాగా పనిచేస్తున్నందుకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును అభినందించారు.కలెక్టర్ కీర్తి చంద్రబాబును సన్మానించారు.రోడ్ల పొడవునా కార్యకర్తలు బారులు తీరారు. పోలీసులు బందోబస్తు, భారీ భద్రత ఏర్పాట్లు చేశారు.గోపాలపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.320 కోట్ల ప్రణాళికను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సీఎంకు అందజేశారు. నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహ కిశోర్, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన నేత సువర్ణరాజు, మహిళా నేతలు స్వాగతం పలికారు.

నేనూ వ్యవసాయం చేసేవాడిని..

నేను కూడా రైతు బిడ్డనే.. వ్యవసాయం చేసేవాడిని.. రైతు కష్టమేంటో తెలిసినవాడిని..అయితే రాజకీయాల్లోకి వచ్చా. ఇవాళ రైతులు చదువుకున్నవారు ఉన్నారని.. పీజీలు, పీహెచ్‌డీలు చేసినవారున్నారని.. అందరూ ప్యాంట్లు వేసుకుని వచ్చారని..మోడరన్ రైతులయ్యారని జోకులు వేయడంతో అందరూ నవ్వుకున్నారు. సభలో సీఎం చంద్రబాబు ఇద్దరు రైతులను తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. అందులో ఒకరు ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ నీలపాల నరసింహం కుడి వైపు కూర్చోగా, నల్లజర్లకు చెందిన గుదే అర్జునరావు ఎడమ వైపు కూర్చున్నారు.

రైతులకు అండగా : ఎమ్మెల్యే మద్దిపాటి



రైతుల ఆదాయం పెంచే విధంగా తమ ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకొచ్చి రైతు కుటుంబానికి అండగా ఉంటుం ది. 25 ఏళ్ల కిందట చంద్రబాబు ఇంకుడు గుంతలు తవ్వండి, చెక్ డ్యామ్‌లు కట్టండి అంటే ఎవరూ పెద్దగా పట్టించుకోలే దు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితిలో రైతులే ఇంకుడు గుంతలు కావాలంటున్నారు.. చంద్రబాబు విజన్ ఇలా ఉంటుంది. నదులను అనుసంధానం చేశారు. రైతుకు ఏది అవసరమో అది చేస్తారు.


ఎలా ఉన్నావయ్యా : ఎమ్మెల్యే నల్లమిల్లి, అనపర్తి ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డితో మాట్లాడుతున్న సీఎం


వెల్‌కమ్ సార్ : సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిశోర్


ఏంటివి : కొబ్బరి పీచుతో తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి దుర్గేష్

అధిక శాతం మఫ్టీలోనే.. నిఘాకు ప్రాధాన్యం



విజిబుల్ పోలీస్.. ఇన్‌విజిబుల్ పోలీసింగ్.. ఇది సీఎం చంద్రబాబు పదే పదే పోలీసులకు చెప్పేమాట. ఆయన నల్లజర్ల పర్యటనకు జిల్లా పోలీసులు ఆ మాటను నిజం చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నరసింహ కిశోర్ 1300 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 12 సెక్టార్లుగా విభజించి నలుగురు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 63 మంది ఎస్ఐలు, మిగతా సిబ్బందిని నియమించారు. 7 స్పెషల్ పార్టీలు, 25 రోప్ పార్టీలు, 5 ఏరియా డీవోఎం పార్టీలను బందోబస్తులో భాగం చేశారు. ఈసారి సుమారు 60 శాతం మందికి యూనిఫాం వేయలేదు. మఫ్టీలోనే జనాల్లో తిరుగుతూ అనుపానులు గమనించారు. మహిళా పోలీసులను మఫ్టీలో మోహరించారు. కీలకమైన ప్రాంతాల్లోని కెమెరాలను డీజీపీ, నిఘా చీఫ్ కంట్రోల్‌కి అనుసంధానించారు. డ్రోన్ల ఫుటేజీలను నిరంతరం పరిశీలించారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఇద్దరు చొప్పున బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.


హాజరైన జనం

1.14 లక్షల మంది రైతు కుటుంబాలను కలిశాం : కలెక్టర్

నవంబరు 24 నుంచి 30వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లాలో లక్షా 14 వేల రైతు కుటుంబాలను కలిశాం. ఇంటింటికి వెళ్లి సీఎం సందేశ లేఖను అందించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ సాంకేతికత, విలువవృద్ధి, ప్రభుత్వ సమన్వయం అనే పంచసూత్రాల అమలుతో వ్యవసాయరంగం బలోపేతవుతుందని 'తూర్పు' జిల్లా కలెక్టర్ కీర్తి పేర్కొన్నారు.

ఆదర్శ రైతులకు సత్కారం




సీఎం సమక్షంలో ఆదర్శ రైతులు సింగరాజుపాలెం గ్రామానికి చెందిన దొండపాటి లక్ష్మీనారాయణ(బాబు), గుండుగొలనుగుంటకు చెందిన ఒబెలిశెట్టి గోపాలకృష్ణ, కురుకూరుకు చెందిన యెలమతి భాస్కరరావు, దుద్దుకూరుకు చెందిన కాకర్ల హరినాథ్, చిట్యాలకు చెందిన గద్దె హరిశ్చంద్రప్రసాద్, యర్నగూడెం గ్రామానికి చెందిన గద్దె మునేశ్వరరావు, వాదాలగుంటకు చెందిన గేద జోగేంద్ర ప్రసాద్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు.

నిరుద్యోగులకు సువర్ణావకాశం!

- టీచర్ పోస్టులు ఖాళీలున్న పాఠశాలల్లో తాత్కాలికంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు
- జిల్లాలో 53 చోట్ల ఖాళీలు.. స్థానికులకు ప్రాధాన్యం
- రేపటిలోగా దరఖాస్తుకు అవకాశం



అమలాపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యాబోధనలో అంతరాయం ఏర్పడకుండా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలలకు అకడమిక్ ఇనస్ట్రక్టర్లను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదునెలలపాటు వీరు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ.12,500, ఎస్జీటీలకు రూ.10వేల చొప్పున పారితోషకాన్ని చెల్లిస్తారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో 53 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను స్కూలు అసిస్టెంట్లుగా, సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియమించేందుకు మండలాలవారీగా ప్రకటనలు జారీ చేసినట్టు డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు. దరఖాస్తుదారులు స్థానిక మండలం, గ్రామానికి చెందిన వారికి ప్రాధాన్యమిస్తామన్నారు. ఈనెల 5లోపు అభ్యర్థులు నిర్ణీత నమూనా దరఖాస్తులను పూర్తి చేసి మండల విద్యాశాఖ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. అమలాపురం మండల పరిధిలో పేరూరు, సూర్యనగర్, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, సాకుర్రు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చినట్టు ఎంఈవోలు గుబ్బల సూర్యప్రకాశం, సరెళ్ల దుర్గాదేవి తెలిపారు. ఈనెల 8 నుంచి 2026, మే 7 వరకు పనిచేయాల్సి ఉంటుందన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

అమలాపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధి గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర తెలిపారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వ్యాధి కొత్తది కాదని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో స్క్రబ్ టైఫస్ కేసులు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ఐదు కేసులు, గతేడాది 12 కేసులు నమోదయ్యాయని వివరించారు. స్క్రబ్ టైఫస్ కొత్తరకం జ్వరం కాదని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్ధారణ కిట్లు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు బుధవారం వీడియోకాన్ఫరెన్సు నిర్వహించి సూచనలు చేశారన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు సంబంధించిన 36 వాహనాల్లో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఓ కీటకం కుట్టడం ద్వారా ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఇది సోకినవారి శరీరంపై కీటకం కుట్టినచోట ఎర్రటి మచ్చ ఉంటుందని, అది క్రమేపీ నల్లగా మారుతుందని తెలిపారు. పొలాలు, తోటలు, దట్టమైన వృక్ష సంపద ఉన్న ప్రాంతాల్లో సంచరించేవారికి ఈ కీటకం కుట్టే ప్రమాదం ఉందన్నారు. జ్వరం వస్తే సమీప ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు.

- వైద్య సిబ్బందితో అవగాహన శిబిరాలు
- ఈ ఏడాది ఇప్పటివరకు ఐదు కేసులు

రాష్ట్ర పండుగగా జగ్గన్నతోట ప్రభల తీర్థం

- సీఎం చంద్రబాబు సమ్మతి.. వారంలో జీవో
- రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని


రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వినికి ఏకాదశ రుద్రుల చిత్రపటాన్ని అందిస్తున్న శివకేశవ యూత్ సభ్యులు

అంబాజీపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా కనుమ సందర్భంగా మొసలపల్లి పరిధిలోని జగ్గన్నతోటలో నిర్వహించే 450 ఏళ్ల చరిత్ర కలిగిన ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ మరో వారం రోజుల్లో ప్రభుత్వం జీవో విడుదల చేసేందుకు కసరత్తు చేస్తుందని రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని తెలిపారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెందిన శివకేశవయూత్ సభ్యులు చైర్‌పర్సన్ తేజస్విని విజయవాడలోని ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా తేజస్విని మాట్లాడుతూ ఈ ప్రాంతావాసుల సూచనల మేరకు ఈ ఏడాది మొసలపల్లిలో జరిగిన ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవాన్ని వీక్షించేందుకు వచ్చి, లక్షలాది మంది పాల్గొన్న ఆ ఉత్సవాన్ని చూశానన్నారు. కోనసీమ ప్రజల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకుని జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్‌తోపాటు సీఎం చంద్రబాబునాయుడు దృష్టిలో తీసుకుని వెళ్లినట్టు ఆమె తెలిపారు. ఈ ఉత్సవానికి సంబంధించిన సమాచారాన్ని శివకేశవయూత్ సభ్యులు పొందుపరిచిన వెబ్‌సైట్ ద్వారా తీసుకున్నట్టు తెలిపారు. ఎంతో గుర్తింపు ఉన్న జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి ప్రభుత్వం గుర్తింపు ఉండాలనే లక్ష్యంతో సీఎంతో రా ష్ట్ర పండుగగా గుర్తించాలని చర్చించినట్టు ఆమె తెలిపారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు సమ్మతించారని, వారం రోజుల్లో జీవో విడుదల అవుతుందని ఆమె తెలిపారు. ఈ ఉత్సవానికి సంబంధించిన సమాచారాన్ని శివకేశవయూత్ పూర్తిస్థాయిలో అందించారని ఆమె తెలిపారు. అనంతరం శివకేశవయూత్ సభ్యులు ఏకాదశ రుద్రుల చిత్రపటాన్ని అందించి సత్కరించారు.

'మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఉత్పత్తులు జరగాలి'

అమలాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తులు నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు పేర్కొన్నారు. అంతరపంటలపై రైతులు ప్రధానంగా దృష్టిసారించాలన్నారు. సమనస రైతు సేవా కేంద్రంలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు ఆధ్వర్యంలో రైతన్న మీకోసం వర్కుషాపు, యాక్షన్ ప్లాన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆయన వీక్షించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యమే ప్రజారోగ్యానికి శ్రీరామరక్ష అని అందుకు తగ్గ విధంగా వ్యవసాయ ఉత్పత్తుల జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్, వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు రాజశేఖర్, డీపీఎం కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : కలెక్టర్

అమలాపురం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నాబార్డు ప్రణాళిక నిధులతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ బుధవారం ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధిపై బుధవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 23 రహదారుల అభివృద్ధి పనులు చేపట్టిందని, ఈ పనులు పూర్తి చేసేందుకు గడువులు నిర్దేశించినట్టు తెలిపారు. టెండరు దశలో ఉన్న పనులు, నిధుల మంజూరు వంటి అంశాలపై సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రహదారి నిర్మాణాలు, చేపట్టిన ప్రాంతాలను పరిశీలించారు. రోడ్ల అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాణ్యమైన మెటీరియల్‌ను వినియోగించాలని, టెండరులో నిర్దేశించిన ప్రకారం డిజైన్, థర్డ్ పార్టీ ఆడిట్‌ల ద్వారా నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని, కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నాణ్యతా లోపాలు తలెత్తితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.రామ పాల్గొన్నారు.

నాణ్యమైన వంగడాలు అందించి రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలి..

ముమ్మిడివరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా నాణ్యతా పరీక్షలు, భూసార పరీక్షలు నిర్వహిస్తూ అనువైన వంగడాలను సాగుచేసేదిశగా తగిన ప్రోత్సాహాన్ని అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. టెస్ట్ ల్యాబ్ సాంకేతిక నిపుణులకు ఈ విషయాన్ని సూచించారు. బుధవారం ముమ్మిడివరంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను భూసార పరీక్షా కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ తీరు పట్ల ఆరా తీసి ఏమేరకు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారో రికార్డుల ఆధారంగా కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఈ కేంద్రాల ద్వారా నాణ్యతా ప్రమాణాలతో కూడిన విత్తనాలు, ఎరువులు, నాణ్యతా పరీక్షలను నిర్వహిస్తూ నకిలీలను అరికట్టాలని సూచించారు.


కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ

మట్టిపాత్రల వినియోగాన్ని ప్రోత్సహించాలి

- జేసీ నిషాంతి ఆదేశం

అమలాపురం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయంగా మట్టిపాత్ర తయారీని ప్రోత్సహించాలని జేసీ నిషాంతి అన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న కుమ్మరి సంఘాల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణహితమైన మట్టి పాత్రల తయారీకి చేపట్టాల్సిన చర్యలను ఆమె సమీక్షించి సూచనలు చేశారు. మట్టి లభించే లంక ప్రాంతాలను గుర్తించి జిల్లా పౌరసరఫరాల అధికారికి నివేదిక అందించాలని సూచించారు. ఎస్సీ బీసీ కార్పొరేషన్ ద్వారా, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కింద సబ్సిడీతో కూడిన రుణాల మంజూరుకు ఎల్డీఎం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఖాళీస్థలాలను గుర్తించి కుమ్మరి పరిశ్రమలకు కేటాయిస్తామన్నారు. నర్సరీల్లో కుండీలు, మట్టిపాత్రలు ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతికి మట్టి పాత్రలను ప్రోత్సహించే దిశగా కలెక్టరేట్‌లో ప్రతి ఉద్యోగికి వాటిని సరఫరా చేస్తామన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ మాట్లాడుతూ జూన్ నాటికి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఫ్రీ జిల్లాగా మార్చే లక్ష్యంతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కాశీవిశ్వేశ్వరరావు, డీసీహెచ్ఎస్ కార్తీక్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి జ్యోతిలక్ష్మీదేవి, ఏడీఎంహెచ్‌వో భరతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

» ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ » కాకినాడ జేఎన్టీయూలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు

జేఎన్టీయూకే, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, వారి కోసం మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. కాకినాడ జేఎన్టీయూలోని అలూమ్ని ఆడిటోరియంలో బుధవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుక నిర్వహించారు. సంక్షేమ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. 2028లో జరిగే పారా ఒలింపిక్స్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి విభిన్న ప్రతిభావంతులు ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తామన్నారు. ట్రైనీ కలెక్టర్ మనీషా మాట్లాడుతూ సామాజిక పురోగతిని పెంపొందించడం కోసం అంగవైకల్యంతో కూడిన సమాజాలను ప్రోత్సహించడం అనే ఇతివృత్తంతో 2025 ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం రెండు వసతిగృహాలు నిర్వహిస్తుండగా వాటిలో 200 మంది బాల, బాలికలు వసతి పొందుతున్నారని తెలిపారు. దృష్టి లోపం ఉన్న వారికి ఒక ఆశ్రమం నిర్వహిస్తుండగా 100 మంది మహిళలు, పురుషులు వసతి పొందుతున్నారన్నారు. ఇప్పటికే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి వివిధ పరికరాలు అందించేందుకు 1,891 మందిని గుర్తించామన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అతిథులు అందజేశారు. విభిన్న ప్రతిభావంతులకు ఉత్తమ సేవలందిస్తున్న 15 సంఘాల ప్రతినిధులకు, ప్రత్యేక పాఠశాలల ఉపాధ్యాయులు 26 మందికి, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా నిర్వహిస్తున్న ప్రత్యేక పాఠశాలల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జేఎన్టీయూకే రెక్టార్ సుబ్బారావు, మహర్షి సాంబమూర్తి ప్రత్యేక పాఠశాల, ఉమా మనోవికాస కేంద్రం, సిరి ప్రత్యేక పాఠశాల, శాంతివర్ధన ప్రత్యేక పాఠశాల, ప్రభుత్వ బధిర ఉన్నత పాఠశాల, కన్నా ఆశ్రయ్ మానసిక పాఠశాల, విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ప్రతినిధులు ఎం.పాపిరెడ్డి, బి.కిరణ్, జి.కొండలరావు, ఎన్.సురేష్, కేఎస్ సుబ్రహ్మణ్యం, అంధ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్, జవహర్, సిరి పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా



సినిమా పాటకు డ్యాన్స్ చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

విశాఖ-తిరుపతి మధ్య ఎనిమిది ప్రత్యేక రైళ్లు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ-తిరుపతి-విశాఖ మధ్య ఎనిమిది ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను జనవరి 13 వరకు నడుపుతున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సామర్లకోట మీదుగా ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు డిసెంబరు 30 వరకూ ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారులకు అందించిన సమాచారంలో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారుల నుంచి ఆంధ్రజ్యోతి సేకరించిన సమాచారం ఇలా ఉంది.

● 08583 నంబరు గల విశాఖ-తిరుపతి మధ్య డిసెంబరు 29 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతికి చేరుతుంది. ఈ ప్రత్యేక రైలు డిసెంబరు 8,15,22,29 తేదీల్లో 4 ట్రిప్‌లుగా నడవనుంది.

విశాఖ నుంచి అన్నవరానికి రాత్రి 8.40 గంటలకు చేరుకుంటుంది. సామర్లకోటకు రాత్రి 9.05 గంటలకు, రాజమహేంద్రవరం నకు రాత్రి 9.55 గంటలకు, నిడదవోలుకు రాత్రి 10.22 గంటలకు చేరుకుని తణుకు, భీమవరం.ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయ వాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుతుంది.

● 08584 నంబరు గల తిరుపతి-విశాఖ మధ్య డిసెంబరు 30 వరకూ ప్రతీ మంగళవారాల్లో బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 4 ట్రిప్‌లుగా నడవనుంది.

ఈ రైలు డిసెంబరు 9,16,23,30 తేదీల్లో 4 ట్రిప్‌లుగా నడవనుంది.

తిరుపతిలో ఈ రైలు మంగళవారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖకు చేరుతుంది.

నిడదవోలుకు ఉదయం 6.15 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరం నకు ఉదయం 6.43 గంటలకు చేరుకుని సామర్లకోటకు ఉదయం 7.28 గంటలకు, అన్నవరం నకు ఉదయం 7.53 గంటలకు చేరుకుని విశాఖకు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుతుంది.

ఈ వారానికి ఒక్కరోజు నడిచే ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కట్లు కోసం సమీప రైల్వే స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ ప్రత్యేక రైలులో 2వ తరగతి ఏసీ, మూడవతరగతి ఏసీ, ఎకానమీ మూడవ తరగతి ఏసీ, స్లీపర్, ఆరు జనరల్ బోగీలు, నాలుగు ఎస్ఎల్ఆర్‌డీ, ఒకటి ఈవోజీలతో కలిపి 21 ఎల్‌హెచ్‌బీ బోగీలతో రాకపోకలు సాగిస్తుంది.

22న నన్నయలో జాతీయ సెమినార్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

దివాన్‌చెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈనెల 22న భారతీయ జ్ఞాన వ్యవస్థలను తిరిగి పొందడం, ముందుకు సాగే మార్గం అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలోని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విద్యాభారతి ఉచ్చా శిక్షా సంస్థాన్(వీబీయుఎస్ఎస్) సహకారంతో రిక్లైమింగ్ ఇండియన్ నాలెడ్జిసిస్టమ్స్ ఫార్వర్డ్ అనే అంశంపై జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వర్సిటీ, అనుబంధ కళాశాలలు, యుజీ, పీజీ స్థాయిలో పాఠ్యాంశాలనుఅనుసరించడం ద్వారా భారతీయ జ్ఞాన వ్యవస్థల గురించి ప్రాథమిక జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం తదనుగుణంగా కోర్సులను ప్రవేశ పెట్టడం ఈసెమినార్ లక్ష్యమన్నారు. సెమినార్ కన్వీనర్లుగా ఆచార్య కె.ఎస్.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్.సజ్నారాజ్ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, సెమినార్ కన్వీనర్లు ఆచార్య కె.ఎస్.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్.సజ్నారాజ్ పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పొల్లూరులో హీరో రవితేజ సందడి

మోతుగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధి పొల్లూరులో రవితేజ హీరోగా నటిస్తున్న నూతన సినిమా చిత్రీకరణ బుధవారం మోతుగూడెం పరిసర ప్రాంతంలో ప్రారంభమైంది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శివ దర్శకత్వం వహిస్తున్నారు. పొల్లూరు శివాలయం వీధులు ఎగువ, దిగువ జలపాతాలు, సీలేరు నది పరీవాహక ప్రాంతాలు, ఫోర్ బై పిక్నిక్, జలాశయాలు వద్ద మరి కొన్ని సన్నివేశాలను చిత్రీ కరించనున్నారు. దీంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రవితేజ అభిమానులు తరలివచ్చారు.



చిన్నారులతో హీరో రవితేజ

‘చేనేత’కు ఎన్నికలు నిర్వహించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని చేనేత కులాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ పంపన రామకృష్ణ కోరారు. బుధవారం కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత సంక్షోభం వల్ల చేతినిండా పని లేక చేనేత కార్మిక కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. చేనేత పాలక వర్గాల పదవీకాలం 13 సంవత్సరాల క్రితం ముగియగా ఇప్పటివరకు ఎన్నికలు జరపలేదన్నారు. దీంతో పర్సన్ ఇన్‌చార్జీల పాలనలో నడుస్తున్నాయన్నారు. దీనివల్ల సొసైటీల అభివృద్ధి కుంటుపడిందన్నారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే సొసైటీల ద్వారా వస్త్రాల అమ్మకాలపై 30 శాతం రిబేటు అమలు చేయాలన్నారు. చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు అన్ని రకాల పథకాలు అమలు చేయాలన్నారు. కార్మికులకు ఉచిత విద్యుత్ అందించడం అభినందనీయమన్నారు. సమావేశంలో నాయకులు సూర్యచంద్రరావు, కె. రామారావు, పి. వెంకటరమణ, కె.సతీష్, పి. వెంకటేశ్వరరావు, పి. శ్రీనివాసులు, ఎస్. వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన లక్ష్మణ్‌రెడ్డి, గాయపడిన రవీంద్ర

రంపచోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బందపల్లి గ్రామానికి చెందిన సోముల లక్ష్మణరెడ్డి, విండెల రవీంద్ర రంపచోడవరం నుంచి బందపల్లికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పీఎంఆర్‌సీ సమీపంలో పవర్ స్టేషన్ వద్ద రంపచోడవరం నుంచి గోకవరం వెళ్తున్న ఆర్టీసీ బస్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. సోముల లక్ష్మణ్‌రెడ్డి(25) అక్కడికక్కడే మృతిచెందగా రవీంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. అతడికి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి కేసులో ఇద్దరి అరెస్ట్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వ్యక్తి మరణించిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులను పిఠాపురం సీఐ శ్రీనివాస్ బుధవారం అరెస్టు చేశారు. తాటిపర్తిలో తేరాటి ప్రసాద్ కూతురు పుట్టిన రోజు సందర్భంగా గత నెల 27వ తేదీ రాత్రి రోడ్డుపై వంటలు చేశారు. అదే దారిలో వచ్చిన వెంపాల సూరిబాబు పెద్ద కోడలు కృష్ణవేణికి అడ్డం పెట్టి బల్ల తగిలి పడిపోయింది. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో సూరిబాబును తోయగా పడిపోవడంతో గాయపడి మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసిన గొల్లప్రోలు పోలీసులు సూరిబాబు మృతికి కారకులైన తేరాటి ప్రసాద్, శ్రీమంతుల ఏసుదయను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్టుసీఐ,ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

శీలా వీర్రాజు పుస్తకాలు
తెలుగు యూనివర్శిటీకి అపూర్వ నిధి

పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



యార్లగడ్డ, వీసీ మునిరత్నం నాయుడికి పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శీలా వీర్రాజు సేకరించిన పుస్తకాల ద్వారా తెలుగు విశ్వవిద్యాలయానికి ఒక అపూర్వ నిధి అందిందని పద్మశ్రీ, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీపీ బ్రౌన్ మందిరం, మాదేటీ రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శీలా వీర్రాజు సేకరించిన జాతీయ, అంతర్జాతీయ చిత్రకళా పుస్తకాలను ఆచార్య యార్లగడ్డ, తెలుగు యూనివర్శిటీ వీసీ ఆచార్య డి.మునిరత్నంలకు దామెర్ల ఆర్ట్ గ్యాలరీలలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రాణహిత కవి సన్నిధానం నరసింహశర్మ అధ్యక్షతన జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ ఎన్టీఆర్ మానసిక పుత్రిక అయిన తెలుగు విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఎన్టీఆర్ పుత్రిక అయిన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, విద్యాశాఖ మంత్రి లోకేశ్ సహకరిస్తారనే విశ్వాసం తనకు ఉందన్నారు. తెలుగు యూనివర్శిటీ అభివృద్ధి రాజమహేంద్రవరం ప్రజల బాధ్యత అన్నారు. తెలంగాణ నుంచి చేరాల్సిన చర స్థిరాస్తుల విషయంలో రెండు వర్సిటీల ఉపకులపతులు ఒక నిర్ణయానికి రావాలని యార్లగడ్డ కోరారు. వీసీ మునిరత్నం నాయుడు మాట్లాడుతూ శీలా వీర్రాజును తాను గతంలో కలిశానని, ఆయన సేకరించిన పుస్తకాలు తమకు బహూకరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు మాదేటి రవిప్రకాష్, ఆంధ్ర యూనిర్శిటీ రిటైర్డ్ ఆచార్యులు డాక్టర్ పర్వతనేని సుబ్బారావు, భగీరధి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌పీఎస్ఎస్ లక్ష్మి, సన్నిధానం శాస్త్రి, మల్లాది శ్రీరామ్, ఇన్‌కంట్యాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ మేడిశెట్టి తిరుమల కుమార్, విశ్రాంత మేజిస్ట్రేట్ ఎస్ఆర్ పృథ్వీ, సామాజిక వేత్త కె.సుర్యకుమారి, అమ్మభగవాన్ సేవకులు మంతెన రాధిక తదితరులు పాల్గొన్నారు.

బాలికపై మేనమామ అత్యాచారం

పోక్సో కేసు నమోదు

పిఠాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తన కళ్లెదుటే పెరిగిన బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలో ఈ సంఘటన జరిగింది. మండలంలో ఓ గ్రామానికి చెందిన పదో తరగతి చదుతున్న బాలికను ఆమె తల్లి నవంబరు 7వ తేదీ రాత్రి 7-8గంటల సమయంలో సమీపంలోనే ఉన్న మేనమామ ఇంటికి వెళ్లి పాలు తీసుకురమ్మని చెప్పింది. దీంతో బాలిక మేనమామ ఇంటికి వెళ్లింది. పాల గిన్నె కనిపించడం లేదని చెప్పి బాలికను లోపలికి రమ్మన్నాడు. తర్వాత తలుపులు వేసి బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎంతకు బాలిక రాకపోవడంతో తండ్రి అక్కడికి వచ్చి తలుపులు కొట్టాడు. తలుపులు తీసిన మేనమామ (30) అక్కడ నుంచి పరారయ్యాడు. పెద్దల్లో విషయాన్ని పెట్టినా ఫలితం లేకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసుకు ఫిర్యాదు చేయగా బుధవారం పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచారానికి పాల్పడ్డ బాలిక మేనమామకు ఇప్పటికే వివాహమై పిల్లలు ఉన్నారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

5,300 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

జగ్గంపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో విజిలెన్స్, సివిల్ సప్లై ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. జగ్గంపేట సివిల్ సప్లై అధికారి కృష్ణ అందించిన వివరాల ప్రకారం.. గోరింట గ్రామానికి చెందిన కోరుకొండ అచ్యుతరావు ఏపీ 39యువై 5549 వాహనంలో రేషన్ బియ్యాన్ని ఇర్రిపాక మీదుగా తరలిస్తున్నట్టు గుర్తించి పట్టుకున్నారు. బియ్యాన్ని ఎంఎస్‌వో పాయింట్ కాటా వద్ద కాటా వేయగా 5,300 కిలోల వచ్చింది. వ్యాన్ డ్రైవర్ అచ్యుతరావు, వ్యాన్ యజమాని గనిశెట్టి రాజు, రైస్ యజమాని మన్యం తేజపై 1955 సెక్షన్‌కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు. రైస్ విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో విజి లెన్స్ సీఐ టి.గోపాలకృష్ణ, ఎంఎస్‌వో జీఎం కృష్ణ సిబ్బంది ఉన్నారు.

ఫేక్ ఇన్‌స్టాగ్రామ్.. అసభ్యకర పోస్టు

కేసు నమోదు

తాళ్లరేవు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పాతకోరింగ గ్రామానికి చెందిన ఒక మహిళ పేరిట గుర్తు తెలియని వ్యక్తి ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ క్రియేట్ చేసి అసభ్యకర ఫొటో పోస్టు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు కోరింగ ఎస్ఐ పి. సత్యనారాయణ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. గతనెల 27న బాధిత మహిళ స్నేహితుల ద్వారా విషయం తెలుసుకుంది. ఫేక్ ఐడీ క్రియేట్ చేసిన వ్యక్తిని ఎవరు నువ్వు ఎందుకిలా చేస్తున్నావని ఆమె మెసేజ్ ద్వారా అడిగింది. సదరు వ్యక్తి పాతకోరింగ గ్రామానికి చెందిన పోతుల వినోద్ అలియాస్ అర్జున్ భార్య ద్వారా మీ వివరాలు తెలుసుకున్నానని చెప్పాడు. దీంతో సదరు మహిళ తనకు అవమానము కలిగినందుకు కోరింగ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో అంగన్వాడీ కార్యకర్త మృతి



భారతి(ఫైల్)

ఉప్పలగుప్తం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం సెక్టార్ పరిధిలోని రాఘవులపేట అంగన్వాడీ కేంద్రం కార్యకర్త, నంగవరానికి చెందిన బొంతు భారతి(42) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందినట్టు సంఘ ప్రతినిధి కె.బేబీగంగారత్నం పేర్కొన్నారు.

8న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్టు కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రధానాధికారి, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మూర్తి బుధవారం తెలిపారు. కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్మెంట్, స్టాఫ్ వచ్చి ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టిసి సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జెరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440408182లో సంప్రదించాలని కోరారు.

మురమళ్ళ వీరేశ్వరుడి ఆదాయం రూ.9.96 లక్షలు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు

ఐ.పోలవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.9,96,203 ఆదాయం వచ్చిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు సమక్షంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో బుధవారం స్వామి హుండీలను లెక్కించారు. గత 45రోజులకు ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.9,87,354, అన్నదానం హుండీ ద్వారా రూ.8,849... 5 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్టు తెలిపారు. హుండీల ఆదాయాన్ని దేవస్థానం బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నట్టు తెలిపారు. తొలుత ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ, బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ హుండీలకు హారతి ఇచ్చి ప్రారంభించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు తదితరులున్నారు.

అంతర్వేదిలో హైకోర్టు జడ్జి పూజలు



జడ్జికి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అంతర్వేది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హైకోర్టు జస్టిస్ వి.గోపాలకృష్ణారావు బుధవారం కుటుంబసమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో దర్శనం నిర్వహింపచేసి వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

గ్రామ సంఘాలు పారదర్శకంగా ఉండాలి

డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ సంఘాలు డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు, తిరిగి చెల్లింపులు, పుస్తక నిర్వహణ, సమావేశాల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రచారం చేయడంలోనూ అత్యంత పారదర్శకతతో ఉండాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట టీటీడీసీ ఆవరణలో కొత్తగా మోడల్ మండలాలుగా ఎంపికైన సామర్లకోట, జగ్గంపేట, గొల్లప్రోలు, కాజులూరు, కరప మండలాల సిబ్బందితో పేదరిక నిర్మూలనలో భాగంగా విజన్ బిల్డింగ్ మాడ్యూల్ 1,2,3లపై ఎంసీఎల్ఎఫ్ఎస్, సీఎల్ఎఫ్‌లస్థాయి అవగాహనా సమావేశం బుధవారం సామర్లకోట ఏపీఎం జగదీశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన పీడీ శ్రీనివాసరావు పలు అంశాలను వివరించారు. డీపీఎం భరత్, ఐబీ ఏపీఎం ఇందిరా అన్ని క్లస్టర్ల ఎల్‌సీలు, సీసీఎస్‌లు పాల్గొన్నారు.



సామర్లకోటలో ప్రసంగిస్తున్న పీడీ శ్రీనివాసరావు

కాలువలను ఆధునికీకరించాలి

అంబాజీపేట, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పంటలకు పూర్తిస్థాయిలో సాగు నీరందించేందుకు సాగు, మురుగునీటి కాలువలను తక్షణమే ఆధునికీకరించాలని రైతు సంఘ నాయకులు కొర్లపాటి కోటబాబు కోరారు. పలు గ్రామాల్లో 3వేల ఎకరాల్లో వరితో పాటు వివిధ రకాల వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

మామిడికుదురు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు పంచాయతీకి సమీపంలో ఆర్‌డబ్ల్యుఎస్ కుళాయి నుంచి తాగునీరు వృథాగా పోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. పది రోజులుగా కుళాయికి ట్యాప్ లేకపోవడంతో తాగునీరు బయటకు ఎగజిమ్ముతోంది. అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. ట్యాప్‌ను ఏర్పాటుచేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలు

అమలాపురం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్లీనంగా నిగూడమైన జ్ఞానాన్ని క్విజ్‌లు, జనరల్ నాలెడ్జ్ పోటీల ద్వారా బహిర్గతమవుతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ 14క్విజ్ పోటీలను జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ధీరూభాయ్ అంబానీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం జరిగిన క్విజ్‌పోటీల్లో పాల్గొనే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల్లో నిబిడీకృతమైన సృజనాత్మకమైన ఆలోచనా శక్తిని, వ్యక్తిత్వ వికాశానికి, సామాజిక మానసిక అభివృద్ధికి ఉపకరిస్తాయన్నారు. పోటీల్లో 120పాఠశాలలకు చెందిన 450మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 80ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, 40 ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. వీరవల్లిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.సత్యప్రసాద్, ఎ.అనూష విన్నర్స్‌గా, పాలగుమ్మి ఎస్ఎంవీఆర్ఎం ఉన్నత పాఠశాలకు చెందిన కె.ప్రసన్నకుమార్, ఎంవీ నాగశ్రీ రన్నర్స్‌గా నిలిచారు. వానపల్లి జడ్పీ పాఠశాల, ఓడలరేవు, ఊబలంక, సిరిపల్లి, ఇందుపల్లి పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లను బహూకరించారు. ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఆదిత్య గొల్లగూడెం విన్నర్స్‌గా, రావులపాలెంనక్షత్ర పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. కొందరికి ల్యాప్‌టాప్‌లు, సైకిళ్లను బహుమతులుగా అందించారు. రిలయన్స్ ప్రతినిధి నితీష్‌కుమార్, క్విజ్ మాస్టర్ సిబ్బంది, ఏవో కాశీవిశ్వేశ్వరరావుపాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనచేసి ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఉపాధి హామీతో గ్రామీణ రోడ్ల నిర్మాణం

రాజోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మెరకపాలెంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. అనంతరం రూ.28.50లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గిడుగు బుజ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిన గ్రామ సచివాలయ భవనాన్ని ఉపాధి హామీ నిధులు, గ్రామస్తుల సహకారంతో నిర్మించామన్నారు. సచివాలయ భవనానికి స్థలాన్ని సమకూర్చిన దాతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా అనేక గ్రామీణ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. వెయ్యి గ్రామీణ రోడ్లు రాజోలు నియోజకవర్గంలో అవసరం ఉండగా ఇప్పటివరకు 50శాతం వరకు రోడ్లు పూర్తి చేశామని తెలిపారు. అనంతరం స్థలదాతను, సర్పంచ్‌ను, సహకరించిన ఇతర దాతలను దుశ్శాలువా కప్పి ఎమ్మెల్యే దేవ ఘనంగా సన్మానించారు. సోమిశెట్టి ఆంజనేయులు, జడ్పీటీసీ మట్టా శైలజ, దిరిశాల బాలాజీ, ఎంపీటీసీ సోమిశెట్టి ధనలక్ష్మి, చాగంటి స్వామి, అడబాల సత్యరమేష్, గిడుగు చంద్రశేఖర్, సూరిశెట్టి శ్రీను, అడబాల చంటి తదితరులు పాల్గొన్నారు.



మెరకపాలెంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ

తుఫాన్లతో నష్టపోతున్న రైతులకు పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్

అమలాపురంరూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్లతో నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో సంస్థలకు అప్పగిస్తూ ప్రభుత్వం చేపట్టిన నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల18న ఆయా మెడికల్ కళాశాలల వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం అమలాపురంలోని ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయంలో శీలం వెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రభాకర్ మాట్లాడుతూ ఈనెల26న ఖమ్మంలో జరగాల్సిన సీపీఐ శత వసంతాల వార్షికోత్సవం తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా 2026 జనవరి 18కి వాయిదా వేశామన్నారు. మహాసభను ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా నుంచిసీపీఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, కార్యవర్గ సభ్యుడు కొప్పుల సత్తిబాబు, రామకృష్ణ, రాము, గెడ్డం ప్రభాకర్, చిట్టూరి ప్రసాద్, ఉండవల్లి గోపాలరావుపాల్గొన్నారు.

గోదావరి వరద నుంచి రక్షణకు గోడ నిర్మాణం

యానాం,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి):గోదావరి వరద రక్షణగోడ నిర్మాణం ప్రాజెక్టుపై 60 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని కేంద్ర జలశక్తి కార్యదర్శి వి.ఎల్.కాంతారావు కోరారని ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. యానాంలో రూ.199కోట్లతో వరద రక్షణగోడ (ఫ్లడ్‌వాల్) నిర్మాణం అనుమతి కోరుతూ మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో పుదుచ్చేరి ప్రజాపనుల శాఖ కార్యదర్శి ఏ.ముత్తమ్మ, చీఫ్‌ఇంజనీర్ వీరసెల్వం, యానాం ప్రజాపనుల శాఖ ఏఈ కాళహస్తి జ్యోతిరాజు, విశ్రాంతి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పితాని వీరనాగ భాస్కరరావులు బుధవారం కేంద్ర జలశక్తి అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కేంద్రజలశక్తి కార్యదర్శితో భేటీ అయ్యారు. కోతకు గురవుతున్న భూముల రక్షణకు చేపట్టాల్సిన చర్యలు, రక్షణ గోడ నిర్మాణం, దరియాలతిప్ప ఐలాండ్ నెంబరు-3 చుట్టూ రక్షణ గట్టు నిర్మాణం, జీఎంసీ బాలయోగి వారధి నుంచి కనకాలపేట వైపు కోతకు గురవుతున్న గోదావరి ఒడ్డుకు సంబంధించి ప్రతిపాదనలను 60రోజుల్లో ఇవ్వాలని కార్యదర్శి కోరారు. 2026 జనవరి 31నాటికి ప్రాజెక్టు ప్రతిపాదనలు తయారుచేసి, కేంద్రం అనుమతులు తీసుకుని పనులు ప్రారంభించాలని కేంద్రజలశక్తి అధికార బృందం పుదుచ్చేరి రాష్ట్ర అధికారులను ఆదేశించింది. న్యూఢిల్లీకి చెందిన సాంకేతిక నిపుణల బృందం సభ్యులు అనుపమ ప్రసాద్, శరత్ చంద్ర, ప్రకాష్ కుమార్ పాల్గొన్నారు.



ఢిల్లీలో పుదుచ్చేరి అధికారులతో చర్చిస్తున్న మల్లాడి

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ శుక్లా

అంబాజీపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్, జిల్లా పరిశీలకుడుఅఖిలేస్ శుక్లా అన్నారు. మాచవరం కుమ్మరిశాలివాహన సంఘ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమావేశం బుధవారం ఏఐసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ జంగా గౌతమ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా శుక్లా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభావాన్ని తీసుకువచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారన్నారు. ప్రజాభిప్రేయ సేకరణ అనంతరం జిల్లాఅధ్యక్షుడి ఎంపికకోసం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖార్గే, కాం గ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీలకు నివేదిక అం దజేస్తామన్నారు. నాయకులు అరిగెల అరుణకుమారి, మల్లిపూడి రాంబాబు, కామన ప్రభాకరరావు, కొత్తూరి శ్రీనివాస్, ముషిణి రామకృష్ణారావు, మాచవరపు శివన్నారాయణ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

రాజోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో అశోక్ లాలాండ్ ట్రక్కులో అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకున్నామని అడిషనల్ ఎస్ఐ కె.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. తాటిపాకలో పీడీఎఫ్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తారన్న సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. పీడీఎఫ్ బియ్యంతో ఉన్న ట్రక్కును సీజ్‌చేసి రాజోలు పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఆరా తీస్తున్నామని ఆయన తెలిపారు.

విజ్ఞానభారతిలో 'సప్తశక్తి సంఘం'

అల్లవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ప్రతీ స్త్రీ భాగస్వామి కావాలని, భగవద్గీతలో ఏడు సద్గుణాలు పాటించాలని సంస్కార భారతి ఆంధ్ర ప్రాంత కన్వీనర్ సాయిలక్ష్మి పిలుపునిచ్చారు. కొమరగిరిపట్నం ఆర్ష విజ్ఞానభారతిలో సప్తశక్తి సంఘం మహిళా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్త్రీలు తలచుకుంటే సాధ్యంకానిది లేదన్నారు. పర్యావరణ పరిరక్షణకు మహిళలు ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. ఆలిండియా రేడియో ఆర్టిస్టు సుధ, విద్యార్థినులు, తల్లులు, పాఠశాలమహిళా సిబ్బంది పాల్గొన్నారు.

జిప్మెర్‌లో ఆపరేషన్ సేవలు

యానాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): యానాం జిప్మెర్ మల్టీ ఆసుపత్రిలో ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ ఆనంద్‌రాజ్ ఆధ్వర్యంలో ట్రైయిల్ బేసీస్‌లో ఆపరేషన్ సేవలు బుధవారం నుంచి ప్రారంభించారు. తొలుత ఆసుపత్రి శస్త్ర చికిత్సల విభాగం వైద్యులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆపరేషన్ థియేటర్ సేవలను ప్రారంభించారు. వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ శిరీష, హరిహరన్, తిరుపతయ్య, గాయత్రి, నితిశ్ సింగ్, విహారి, నవేష దుర్గా, డిప్యూటి నర్సింగ్ ఆఫీసర్లు వెన్నెల, ఇంద్రాణి, భువనేశ్వరి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమతో ఆదరించాలి

రాజోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని రాజోలు కోర్టు ప్యానల్ లాయర్ జేహెచ్ సాగర్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాజోలులో భవిత కేంద్రం వద్ద బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగులకు అందించే చట్టపరమైన ఉచిత న్యాయ సలహాలపై ఆయన అవగాహన కల్పించారు. జి.విజయభాస్కర్, బి.సుబ్బలక్ష్మి, డి.అనిత పాల్గొన్నారు.

90శాతం రహదారులు అభివృద్ధి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏమైనారహదారులు అధ్వానంగా ఉంటే ఆలోపం సర్పంచ్‌లు, ఎంపీటీసీలదేనని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలో 90శాతం మేర రహదారులు అభివృద్ధి చేశామన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన 2025-26 సవరణ బడ్జెట్, 2026-27 అంచనాల బడ్జెట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లెపండుగలో భాగంగా మండలానికి రూ.5.86కోట్లతో రోడ్లకు ప్రతిపాదనలు పంపించగా ప్రస్తుతం రూ.1.55 కోట్లు మంజూరయ్యాయని, మిగిలిన నిధులు కూడా త్వరలోనే వస్తాయన్నారు. మండలంలో విద్యుత్ సమస్యలుంటే నాదృష్టికి లేదా డీఈ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సమస్యలపై ఫిర్యాదులు వస్తే మండలం నుంచి బయటకు పంపిస్తానని ఏఈ ఆచార్యులను ఎమ్మెల్యే హెచ్చరించారు. లంకలగన్నవరంలో నూతన రేషన్‌కార్డుల పంపిణీలో డీలర్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మాదగ్గర బియ్యం తీసుకుంటేనే కార్డులు ఇస్తామని బెదిరిస్తున్నారని ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పరిష్కరించాలని డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణకు ఎమ్మెల్యే సూచించారు. విద్యుత్, తాగునీరు తదితర సమస్యలను ఎంపీటీసీలు చెల్లిబోయిన గంగాదేవి, దామోదరం, సూరయ్యకాపు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. 2026-27లో బడ్జెట్‌లో అన్ని పన్నుల కింద ఆదాయం రూ.83,56,17,000, ఖర్చు రూ.83,55, 59,000 కాగా రూ.58,000 మిగులు బడ్జెట్ చూపించారు. ఈబడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. కానీ సవరణ, అంచనా బడ్జెట్‌పై ఏవిధమైన చర్చ లేకుండానే సమావేశాన్ని ముగించేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.మల్లికార్జునరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకున్నామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అయితే ఒక్కోసారి అనుకోకుండా జరిగే ప్రమాదాల నుంచి పాఠశాలల, కళాశాలల బస్సుల నుంచి విద్యార్థులు ఏవిధంగా బయటపడాలో వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రహదారి భద్రత, ప్రమాదాల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా అమలాపురంలో ఒక విద్యా సంస్థకు చెందిన 29బస్సులను తనిఖీలుచేసి సాంస్కృతిక పరమైన లోపాలను గుర్తించి వారం రోజుల్లోగా సరి చేయించాలని అప్పటికప్పుడే స్కూలు యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశామన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్ పాల్గొన్నారు.

చెయ్యేరులో రొయ్యలకు ఈహెచ్‌పీ వ్యాధి

నిర్ధారణకు పరీక్షలు నిర్వహించిన సిఫ్ట్ బృందం



కాట్రేనికోన, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరులో రొయ్యల చెరువుల్లో రొయ్యలకు ఈహెచ్‌పీ వ్యాధి సోకిందన్న సమాచారంతో రాష్ట్ర మత్స్యపరిశోధనా సంస్థ(సిఫ్ట్), ఎన్ఎస్‌పీఏడీ బృందం బుధవారం చెరువులను సందర్శించి నమూనాలు సేకరించింది. దాదాపు 300ఎకరాల ప్రాంతంలో ఈహెచ్‌పీ వ్యాప్తికి అవకాశం ఉన్నట్టు ప్రాథమిక సమాచారం లభించింది. ఈసమాచారాన్ని నిర్ధారించేందుకు 8 అనుమానిత చెరువుల నుంచి ఈహెచ్‌పీ నమూనాలు సేకరించి, పరీక్షల కోసం సిఫ్ట్ రిఫరల్ ల్యాబ్‌కు పంపించారు. చెరువులు 45-60 రోజుల కల్చర్ దశలో ఉన్న సమయంలో సాధారణంగా రొయ్యలు 90-100 కౌంట్‌లో ఉండాలి. వ్యాధిప్రభావం కారణంగా సేకరించిననమూనాలు 180-200 కౌంట్‌గా కన్పించడం గుర్తించారు. సీడ్ నాణ్యత తగిన స్థాయిలో లేనట్టు ప్రాధమికంగా నిర్ధారణ అయ్యింది. ల్యాబ్ విశ్లేషణ ఫలితాల అనంతరం వ్యాధి నిర్ధారణ అవుతుందని సిఫ్ట్ బృందం తెల్పింది.

డిమాండ్ మేరకే విత్తన ఎంపిక జరగాలి

ఉప్పలగుప్తం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వచ్చే దాళ్వాలో డిమాండ్ ఉన్న వరి రకాలను మాత్రమే సాగు చెయ్యాలని మండల వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో రైతన్నా! మీ కోసం కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఏ రకాలకు డిమాండ్ ఉందో పరిశీలించి ఆ రకాలను మాత్రమే సాగు చెయ్యాలని అన్నారు. సాగునీటి భద్రతపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. నాట్ల దశ నుంచి పైరు పక్వానికి వచ్చే వరకు ఆయా దశల్లో అవసరమైన మేరకే నీటిని వినియోగించాలన్నారు. సాగునీటి యాజమాన్యం, విత్తన ఎంపిక, ప్రకృతి వ్యవసాయం రైతులకు ఏవిధంగా ప్రయోజనకరమో ఆయన వివరించారు. నీటి పంపిణీ సంఘం మాజీ చైర్మన్ అరిగెల నానాజీ, సొసైటీ చైర్మన్ ఆకేటి శ్రీనివాసరావు, నీటి సంఘం చైర్మన్ నల్లా సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, గొలకోటి తాతాజీ, ఆకేటి సత్తిబాబు, రైతులు పాల్గొన్నారు.

6న అమలాపురంలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో పనిచేసేందుకు ఈనెల6న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారిణి యా.వసంతలక్ష్మి తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ విద్యార్హతలు గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్సు కాపీలతో 6వ తేదీ ఉదయం 10గంటలకు అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆమె కోరారు. వివరాలకు సెల్ 8978905032ను సంప్రదించాలన్నారు.

బయోచార్‌ను వినియోగించేందుకు చర్యలు

అంబాజీపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బయోచార్‌ను ప్రతి ప్రాంతంలో వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ సభ్యుడు ముత్యాల జమీలు కోరారు. ఈసందర్భంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దీవేష్ చతుర్వేదికి జమీలు వినతిపత్రాన్ని అందించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సాగు చేస్తున్న భూముల్లో సేంద్రియ కర్బనం తక్కువగా ఉందన్నారు. ఈనేపథ్యంలో చౌకగా దొరికే బయోచార్‌ను వినియోగడం ద్వారా కొంత మేర దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు.

కళాశాలలో 'తిల' సినిమా షూటింగ్



అమలాపురం టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో గత మూడు రోజులుగా సినిమా సందడి నెలకొంది. నూతన నటీనటులతో నిర్మిస్తున్న తిల-1999 నవంబరు 9 సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. 1999లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు డైరెక్టర్ ఎం.రాజేశఖర్‌జై పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థుల తరగతి గదుల్లో సినిమా షూటింగ్ బుధవారం జరిగింది. నటుడు ఎం.జైకుమార్, నటి లక్ష్మి, ఉపాధ్యాయులుగా కళాశాలకు చెందిన ఎన్.రత్నవాణి, కరాటం ప్రవీణ్, త్రిమూర్తులు నటించారు. విద్యార్థులు, అధ్యాపకుల మధ్య జరిగే కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. షూటింగ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు, ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎన్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

అమలాపురం టౌన్/రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రేయ దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. శ్రేయస్కూలు వ్యవస్థాపకుడు డాక్టర్ కె.శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగులకు ఇచ్చే ప్రత్యేక రాయితీలు తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.దశరథరామయ్య, బందా ఆర్.కామేశ్వరరావు పాల్గొన్నారు. ఈదరపల్లిలోని హరిమనో వికాస కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాజశేఖర్ కేక్ కట్‌చేశారు. పి.ఆనంద్, పి.లోకేశ్, వి.బాబి, వి.విజయఆనంద్, కె.ఆనంద్, బి.రత్నకుమారి, ఆర్.శాంతకుమార్ పాల్గొన్నారు.

లక్నో స్కౌట్ మహామేళాలో గోపాలకృష్ణ..

అమలాపురం టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర బృందానికి నిర్దేశకునిగా వ్యవహరించిన సీనియర్ విద్యాశాఖాధికారి ప్రముఖ క్రీడాకారుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణను బుధవారం పలువురు అభినందించారు. లక్నోలో ఇటీవల జరిగిన 19వ జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ మహామేళాకు రాష్ట్రం బృందానికి గోపాలకృష్ణ నిర్దేశకునిగా వెళ్లి తిరిగి వచ్చారు. ఈసందర్భంగా అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో క్రీడాభారతి జిల్లా కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ చేసినప్పటికీ విద్యార్థులను క్రీడాకారులుగా, స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా తీర్చిదిద్దుతున్న గోపాలకృష్ణ సేవలను వక్తలు కొనియాడారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎంపీ

అల్లవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరులో భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ర్వత మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. మాజీ ఎంపీ చింతా అనురాధ, జడ్పీటీసీ కొనుకు గౌతమి, చింతా భాస్కరరావు, గూటం సత్యనారాయణ, మద్దా వినోదరావు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

మామిడికుదురు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వరి విత్తనాలను నగరం సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ పంపిణీ చేశారు. మామిడికుదురు వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమం ఏర్పాటుచేసి రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు.వ్యవసాయశాఖాధికారి ఎన్వీవీ సత్యనారాయణ, సొసైటీ సీఈవో అడబాల పెద్దిరాజు, వ్యవసాయ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ఏఈవో ఆర్.శివ, వీఏవై బొక్కా శ్రీరామచంద్రశేఖర్ పాల్గొన్నారు.


నగరం పీహెచ్‌సీ పనితీరు మెరుగుపర్చుకోవాలి

మామిడికుదురు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు పనితీరు మార్చుకోవాలని, దీనిపై పలు ఆరోపణలు వస్తున్నాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వైద్యశాఖ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుసుమ వనజాకుమారి అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిధిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ పథకాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. నగరం పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలని ఈలి శ్రీనివాస్ ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ అమలు చేయడంలేదని జడ్పీటీసీ సభ్యుడు కసిరెడ్డి అంజిబాబు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. పాశర్లపూడిలంకలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, సంబంధిత అధికారులతో మాట్లాడానని, త్వరలో అది కార్యరూపం దాల్చనుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.భవానీ, తహశీల్దార్ సునీల్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

అంబాజీపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.చిరతపూడిరైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. రైతు అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, సర్పంచ్ కోట బేబీరాణి, సొసైటీ చైర్‌పర్సన్ రంపం సత్యనారాయణ, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, పబ్బినీడి రాంబాబు మద్దాల సుబ్బారావు, సరెళ్ళ వెంకటేశ్వర్లు, అయ్యగారి సూరిబాబు, నాగాబత్తుల సుబ్బారావు, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఈదరాడ విద్యార్థుల ప్రతిభ



మామిడికుదురు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరిగే కౌశల్ ప్రతిభాన్వేషణ పరీక్షకు ఈదరాడ హైస్కూలు 9వ తరగతి విద్యార్థి వై.పాలముకేష్, 10వ తరగతి విద్యార్థి జేమ్స్ విక్కీలు ఎంపికైనట్టు స్కూలు ప్రధానోపాధ్యాయుడు జి.సాయిబాబా తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన ఫలితాల్లో రాష్ట్రస్థాయికి 12మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిలో తమ విద్యార్థులు ఇద్దరు కావడం గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయిలో ఈనెల27న తిరుపతిలోని భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో పరీక్ష జరుగుతుందని, ఇందులో తమ విద్యార్థులు జిల్లా తరపున క్విజ్ విభాగంలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గిడ్డి



ముమ్మిడివరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్పీ రాహుల్ మీనాను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలియజేశారు. జిల్లాలోని శాంతి భద్రతలు, ఇతర అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట కేఎం రజా (రజ్వీ), రమేష్ ఉన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ముమ్మిడివరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో నగరపంచాయతీ పరిధిలోఉన్న భవిత మానసిక దివ్యాంగుల స్కూలులో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈసదస్సులో జడ్జి రహ్మతుల్లా మాట్లాడుతూ శరీరంలో లోపాన్నిచూసి జాలి పడడం కాదు, వారిలో ఆత్మవిశ్వాసం నింపాలన్నారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, కాశి సిద్ధార్థకుమార్, భవితస్కూలుటీచర్ ఆర్.రమాదేవిపాల్గొన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ముమ్మిడివరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా విభాగంలో బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ మాట్లాడుతూ దివ్యాంగులు అనేక రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలబడడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మరో ముఖ్యఅతిథిగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు మాట్లాడుతూ దివ్యాంగులకు టీడీపీ మొదటి నుంచి బాసటగా నిలుస్తుందన్నారు. మెప్మా సీఎం ఎం.సోమానిభాస్కర్ పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనుల నిమిత్తం ఈనెల4,5 తేదీల్లో కాట్రేనికోన విద్యుత్క సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. గురు,శుక్రవారాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఘనంగా పడి పూజ

అంతర్వేది, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది బెల్లంకొండవారి గ్రూపు దిండకొడపలో శ్రీవిజయదుర్గాదేవి ఆలయం వద్ద భవానీలు భక్తులతో బుధవారం పడిపూజ వైభవంగా జరిగింది. తొలుత అమ్మవారి వేషధారణలో భవానీలు కలశను శిరస్సుపై ధరించి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నుంచి వైభవంగా భక్తుల కోలాహలం నడుమ పడిపూజ జరిగింది. రాత్రి భవానీలు, భక్తుల ఆధ్వర్యంలో నిప్పుల గుండం, పూజా కార్యక్రమం జరిగింది. పలు గ్రామాల నుంచి భక్తులు పడిపూజ, నిప్పుల గుండం చూసేందుకు తరలివచ్చారు. మంగళంపల్లి సత్తిపండు గురుస్వామి ఆధ్వర్యంలో అంజి (గద), నవీన్, పవన్ బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు. కటికిరెడ్డి మహేష్‌స్వామి ఆధ్వర్యంలో జ్యోతి స్వరూప అయ్యప్ప భజనా సమాజం వారితో భజనా కాలక్షేపాలు జరిగాయి.

అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన మరుపల్లి అభిలాష్ బుధవారం కుటుంబ సమేతంగా శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.51.009 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనంచేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. దాతను ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు అభినందించారు.

సీహెచ్.గున్నేపల్లిలో రైతన్నా మీకోసం..

ముమ్మిడివరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీహెచ్ గున్నేపల్లి పంచాయతీ పరిధిలో రైతన్నా నీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ గొలకోటి దొరబాబు మాట్లాడుతూ ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. కార్యక్రమానికి యాళ్ల ఉదయ్, పాము హేమకుమారి, గొలకోటి భాస్కర్, గొలకోటి తాతాజీ, గొలకోటి కాశి, సకిలే వెంకటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ ఇందుమతి, కృష్ణవేణి, వ్యవసాయశాఖ ఏడీఏ గౌతమ్, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

పి.గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం శివారు నడిగాడిలో బుధవారం స్రవంతి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు 240కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నాగేశ్వరరావు, కోఆర్డినేటర్ గనిశెట్టి ఈశ్వర్, కమిటీ సభ్యులు పిల్లి శివయ్య, పైడి నిత్యానందరావు, గూటం ఏసువర్మ, పమ్మి నాగేశ్వరరావు, సత్యనారాయణ, పిల్లి రామచంద్రరావు, మహిళలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందన

మామిడికుదురు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన షేక్ సుభానీ దంపతులను బుధవారం మామిడికుదురు హైస్కూలులో హెచ్ఎం బి.చిరంజీవిరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.సత్యనారాయణ, వీహెచ్ మనోహరరాజు, బళ్ల శ్రీనివాసరావు, వి.సాయిబాబు, బయ్యా మోహన్, సీహెచ్ రమేష్‌బాబు, గంటి భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్, సీఎంవోల హైస్కూల్ సందర్శన

అల్లవరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం జడ్పీ హైస్కూలును డిప్యూటీ కలెక్టర్, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి, సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యంలు బుధవారం సందర్శించి తనిఖీలు నిర్వహించారు. మెగా పేరెంట్స్ మీటింగ్ 3.0వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనపథకాన్ని పరిశీలించారు. కిచెన్‌గార్డెన్ పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. ఎంఈవో కె.కిరణ్‌బాబు, ఎంఈవో2 ఎస్.ఏడుకొండలు, హెచ్ఎం ఎస్.సత్యనారాయణ, సీఆర్ఎంటీ ఎన్.వెంకట్రావుపాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన

యానాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): యానాం విద్యా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరుగుతున్న ప్రాంతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వివిధ విభాగాల్లో 117ప్రదర్శనలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలు ప్రదర్శనలు పరిశీలించి విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటిలో 16ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు.

మండపేట

కాలువగట్టు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



చింతలూరు ఎన్టీఆర్ కాలనీ వద్ద కాలువగట్టును అభివృద్ధి చేస్తున్న గ్రామస్తులు

ఆలమూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చింతలూరు ఎన్టీఆర్ కాలనీ వద్ద ఉన్న కాలువగట్టు అభివృద్ధికి చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు అధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాలనీకి ఆనుకోని ఉన్న కాలువ గట్టుపై చెత్త వేయడంతో కాలనీవాసులతో పాటు ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామానికి చెం దిన గన్ని నారాయణరావు, సూర్యలక్ష్మిల అధ్వర్యంలో అభివృద్ధికి చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎన్ఆర్ఐల సహకారంతో కాలువగట్టును అభివృద్ధి చేయాలనే సంకల్పంతో బుధవారం నీటి సంఘం అధ్యక్షుడి సహకారంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గన్ని వెంకట్రావు, వైట్ల శేషబాబు, చుంద్రు అమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో ఆయనకు సుస్థిరస్థానం

• దివంగత శ్రీవరప్రకాష్ సంతాప సభలో వక్తలు • ప్రముఖుల నివాళి



దివంగత ప్రకాష్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

మండపేట, డిసెంబరు, 3(ఆంధ్రజ్యోతి): దివంగత చుంద్రు శ్రీవరప్రకాష్ ప్రజల హృదయాల్లో ఎల్లప్పుడు నిలిచి ఉంటారని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, పట్టణ ప్రముఖులు మాదవిబాబు, ప్రకాష్ మిత్ర బృందం అన్నారు. దివంగత ప్రకాష్ దినకర్మను మండపేట- ఆలమూరు రోడ్డులో వున్న ఒక కన్వెన్షన్ హాలులో బుధవారం నిర్వహించారు. కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు ప్రకాష్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు నివాళులర్పించిన సమయంలో ఆయన మిత్ర బృందం కన్నీటి పర్యంతమయ్యారు. బుధవారం జరిగిన దిన దశకర్మ కార్యక్రమాలకు పట్టణానికి చెందిన ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, టీడీపీ, జనసేన కూటమి నేతలు హాజరయ్యారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని మిత్ర బృందం తెలిపారు. మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దివంగత ప్రకాష్ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ రంగారావుతో పాటు ఉద్యోగులు నివాళులర్పించారు.

'తూర్పు'లో విలీనంపై హర్షం

కపిలేశ్వరపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయడంపై మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది బుధవారం హర్షం వ్యక్తం చేశారు. బుధ వారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

మండపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలతో పాటు నిబంధనలు అతిక్రమించి నిర్మించిన భవనాలు, అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు కోరారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

చెరువు కలుషితం అవుతున్నా పట్టదా?

• అధికారుల ఉదాశీనతపై రైతుల ఆగ్రహం • సమస్య పరిష్కరించాలని కాలనీవాసుల వినతి

మండపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి శివారు వేములపల్లిలో వున్న కోళ్ల ఫారాల వ్యర్థాలు పంట బోదె ద్వారా పంచాయతీ చెరువులోకి వదలడంతో కలుషితమవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యర్థాల వల్ల సమీపంలోని రైతులతోపాటు గోదాముల నిర్వాహకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేములపల్లిలోని జగనన్న కాలనీల్లో అధిక సంఖ్యలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ కోళ్లఫారాల వల్ల దుర్గంధం వ్యాప్తిచెంది తరచూ రోగాల బారిన పడుతున్నామని వారు ఆరోపిస్తున్నారు కోళ్లఫారాల నుంచి వ్యర్థాలు బయటకు రాకుండా చర్యలు తీసుకుని ప్రజారోగ్యం కాపాడాల్సిందిగా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కోళ్లఫారంనకు సంబంధించిన వ్యవహారంపై స్థానిక పంచాయతీ కార్యదర్శి ఏవీవీ రమణను వివరణ కోరగా స్థానికుల ఫిర్యాదు మేరకు కోళ్లఫారం యజమానికి నోటీసు జారీ చేశామని చెప్పారు. వ్యర్థాలు వదిలితే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఇప్పటికే వ్యర్థాలు గురించి గ్రామానికి చెందిన యువనేత ఒకరు ఆందోళనకు దిగగా, స్థానిక కూటమి నేతలు కలుగ చేసుకుని తాత్కాలిక పరిష్కారంగా బోదె నుంచి చెరువులోకి వ్యర్థాలు రాకుండా అడ్డుకట్ట వేశారు.



కోళ్లఫారం వ్యర్థాలను పంచాయతీ చెరువులో కలుస్తున్న దృశ్యం

విజయదుర్గా పీఠంలో నేడు మార్గశిర పౌర్ణమి పూజలు

రాయవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వెదురుపాక విజయదుర్గా పీఠంలో నేడు మార్గశిర పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. బుధవారం పీఠంలో అడ్మినిస్ట్రేటర్ మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు , భవానీ శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వర స్వామికి తులసిదళ అర్చనలు జరుగుతాయన్నారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి మహిళలతో సామూహిక శ్రీచక్ర అర్చనలు జరుగుతాయన్నారు. దత్త జయంతిని పురస్కరించుకుని పీఠంలో ఉన్న దత్తాత్రేయుడికి అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు.

ఆళ్వార్‌కు ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు బుధవారం ఆళ్వార్ మండపంలోనున్న ఆళ్వార్లకు అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవాకాలం, ద్రవిడ వేద పారాయణ నిర్వహించారు. సాయంత్రం ఆళ్వార్ల పల్లకీ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయ ఉపకమిషనరు, ఈవో చక్రధరరావు ఆయా ఏర్పాట్లు పర్యవేక్షించారు. అన్నదాన ట్రస్టుకు దాతలు విరాళాలు అందించారు.

డిప్యూటీ కలెక్టర్‌గా రాజేశ్వరరావు

ఆత్రేయపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం తహశీల్దారుగా పనిచేస్తున్న టి.రాజేశ్వరరావు ఇటీవల పదోన్నతి పొందారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు రాజమహేంద్రవరం కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. బుధవారం ఆయన్ను రెవెన్యూ సిబ్బంది, పలువురు ఉద్యోగులు తదితరులు సన్మానించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

రైతన్నా మీ కోసం కార్యక్రమంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల





రామచంద్రపురంలో రైతన్నా మీకోసం సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్. పక్క చిత్రంలో మండపేట సహకార సంఘం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ద్రాక్షారామ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సుభాష్ అన్నారు. బుధవారం రామచంద్రపురం మండలం కందులపాలెంలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రకృతి సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రొసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే పంచ సూత్రాలతో అన్నదాతలకు అండగా నిలిచేందుకు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మొంథా తుఫాను కారణంగా నియోజకవర్గంలో 31,500 మంది రైతులకు రూ.31.85 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామన్నారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంతో పాటు, వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ మాట్లాడుతూ రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో ఇప్పటికే రైతులకు రూ.14 వేలు అందించామన్నారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ త్రీమన్ కమిటీ ఛైర్మన్ వైట్ల రాజబాబు, మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, సర్పంచ్ పెంకె కృష్ణవేణి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రైతు విభాగం అధ్యక్షులు బలుసుశివ ప్రసాద్, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు పెంకె సాంబశివరావు, ఏఎంసీ డైరెక్టర్లు రాఘవేంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, వైట్ల గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న వల్లూరి అప్పారావు సహకార సంఘం వద్ద బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సహకార సంఘ అధ్యక్షుడు కుక్కల రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మండపేట వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. రైతుల కోసం సీఎం చంద్రబాబు ప్రారంభించిన రైతన్నా మీకోసం కార్యక్రమం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. మారుతున్న కాలంతోపాటు వ్యవసాయం చేసే రైతులు టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. పంటల మార్పిడి చేసుకుని గిట్టుబాటు ధర వచ్చే పంటలను సాగు చేసుకోవాలని ఆయన కోరారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నద న్నారు. నియోజకవర్గంలో 9.17 లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. సమావేశంలో పడాల జిన్నయ్య, ఆలమూరు వ్యవసాయశాఖ ఏడీ సీహెచ్‌కేవీ చౌదరి, స్థానిక మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

డిమాండ్ ఆధారిత రకాలు సాగుచేయాలి

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రకాలను రైతులకు పండించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి ఏ. సద్గురుమూర్తి అన్నారు. బుధవారం కుందూరులో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలోని 22 రైతు సేవా కేంద్రాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమాలు నిర్వహించారు. కుందూరులో జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జగతా వెంకట రమణారావు, కూటమి నాయకులు మేడిశెట్టి బాబి, వీఏఏ రేవతి, పశు సంవర్ధశాఖ సహాయకులు కల్యాణి, సౌజన్య, కోటి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతాలు

• తెల్లవారుజాము నుంచే కిటకిటలాడిన హనుమంతుని ఆలయాలు • భక్తుల ప్రత్యేక పూజలు



మండపేట కరాచి సెంటరులో వున్న ఆంజనేయస్వామి ఆలయంలో జరిపిన హనుమత్ వ్రతం

మండపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వందేళ్ల చరిత్ర కలిగిన స్థానిక కరాచి సెంటరులో వున్న ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం అర్చక స్వాములు ఖండవల్లి పవన్ కుమార్ నేతృత్వంలో స్వామివారికి హనుమత్ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, లక్ష తమలపాకులు, గంధ సింధూరనామార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా పూజల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

తమలపాకులతో పూజలు

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ర్యాలి హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలోనున్న ఆంజనేయస్వామికి లక్షతులసి పూజను కన్నుల పండుగగా నిర్వహించారు. బుధవారం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. మహిళలు తమలపాకులపై శ్రీరామనామంతో రాసిన ఆకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర జ్యోతులతో హనుమత్ అలంకరణతో దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘు ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆయా పూజలను నిర్వహించారు.

వైభవంగా వార్షికోత్సవం

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): మోడేకుర్రు శివారు రాకుర్తిపాలెంలో బుధవారం హనుమాన్ 35వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. దీనికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు యువ నాయకుడు బండారు సంజీవ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జక్కంశెట్టి చంటి, సరెళ్ల సరిత, చిలకలపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, బండారు రాజేష్, బొంతు గౌరీశంకర్, రెడ్డి శ్రీనివాస్, బండారు రాజేష్, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామల్లో బుధవారం హనుమత్ వ్రతం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అంగర, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, టేకి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకాలు, తమలపాకులు, గంధసింధూరం తదితర పూజలను ఆయా ఆలయాల అర్చకుల ఆధ్వర్యంలో పలువురు వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్వామివారి గ్రామోత్సవం జరిగింది. భక్తజనం స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల వద్ద భజన బృందాలు భక్తి గీతాలను ఆలపించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): వెంటూరు గ్రామంలోని జిమ్మిరేవు వద్ద ఉన్న శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమద్ వ్రతం పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు మధు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సువర్చల సమేత ఆంజనేయస్వామికి సింధూరపూజ, నాగవళిదళ అర్చన, హారతులు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా భక్తులతో రామనామ పారాయణం జరిపారు. కార్యక్రమంలో శ్రీవీరాంజనేయ బాలభక్త సమాజ సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమద్ వ్రత పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలమూరు, చింతలూరు, పెదపళ్ల, సంధిపూడి, జొన్నాడ, నర్సిపూడి, మోదుకూరు, చొప్పెల్ల, మడికి తదితర గ్రామాల్లోని ఆయా ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమద్ వ్రతం పూజలు జరిపించారు. ఆలమూరు మెయిన్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కాళ్లకూరి సూరిపండు అధ్వర్యంలో హనుమద్ వ్రతం పూజలను జరిపించారు. ఉదయం నుంచే భక్తుల రాకతో ఆయా హనుమాన్ ఆలయాల్లో రద్దీ నెలకొంది.

లక్షతులసి పూజ

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలోని శ్రీభక్తాంజనేయ ఆలయంలో బుధవారం లక్ష తులసి పూజ, సింధూర పూజ నిర్వహించారు. హనుమత్ వ్రతం ఉత్సవాల్లో భాగంగా వీటిని నిర్వహించారు. వేద పండితులు సుదర్శనం లక్ష్మీనారాయణాచార్యులు, ఆలయ అర్చకులు అంగర లక్ష్మీనరసింహచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి లక్షతులసి, సింధూర పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

జానకిరామయ్య సేవలు ప్రశంసనీయం

ద్రాక్షారామ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, సోమేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ దివంగత అన్యం జానకిరామయ్య తెలుగుదేశం పార్టీకి అందించిన సేవలు ప్రశంసనీయమని మంత్రి సుభాష్ అన్నారు. బుధవారం రామచంద్రపురం మండలం వెల్లలో ఇటీవల మృతి చెందిన ఆయన సంతాప సభలో మంత్రి సుభాష్ పాల్గొని ప్రసంగించారు. ముందుగా జానకి రామయ్యచిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి మంత్రి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మంచి వ్యక్తిని తెలుగుదేశం పార్టీ కోల్పోయిందన్నారు. కష్టాల్లో ఉన్న వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, బీసీ సెల్ నాయకుడు పెంకె సాంబశివరావు, విత్తనాల వెంకటరమణ, కంచుమర్తి బాబూరావు, దంగేటి గౌరీశంకర్, ఆకుల సతీష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కపిలేశ్వరపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు, కాలేరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ హిందీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో కె.తాతారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేని ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తాత్కాలికంగా నియమించామన్నారు. అసిస్టెంట్ పోస్టులకు రూ.12,500, ఎస్జీటీకి రూ 10,000 గౌరవ వేతనం ఇస్తారన్నారు. అర్హత కలిగిన వారు గురువారం సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని ఎంఈవో కె.తాతారావు, కె. విజయ్‌కుమార్ తెలిపారు.

ఆర్థికసాయం

ఆత్రేయపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం చిన్నపేటకు చెందిన పల్లి శాంతకుమారి తాటాకిల్లు అగ్నికి ఇటీవల ఆహుతవగా ఆమె కుటుంబం నిరాశ్రులయ్యారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించి, రూ.10వేల నగదును బాధిత కటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిలువూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవం

ఆలమూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చెముడులంకలోనున్న గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గరగనృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించగా, అమ్మవారికి పసుపు కుంకుమలతో స్వాగతం పలికారు. అమ్మవారి మహోత్సవాలను గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట



కొత్తపేట సభలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రామచంద్రపురంలో దివ్యాంగులకు నిర్మించే సామాజిక భవన నిర్మాణానికి సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు, న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, మాగాపు అమ్మిరాజు, వీఆర్‌వోల సంఘం నాయకులు బాపూజీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, ప్రజాసేన అధ్యక్షుడు కాటే సుబ్రహ్మణ్యం, కంచుమర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం అందిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెలగల పణికృష్ణారెడ్డి, జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు శాకా నాగేంద్ర అన్నారు. బుధవారం సోమేశ్వరం భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం వి.శేషమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో- 2 వై.సూర్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగుల్లో జ్ఞాపశక్తి, సామర్థ్యాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వారికి చక్కని మార్గదర్శకాలు చేస్తే అద్భుతాలు సాధించగలరన్నారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు ఫణికృష్ణారెడ్డి వితరణతో ఇచ్చిన ఆట వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన గ్రామశాఖ కార్యదర్శి కాళ్ల మణి ప్రసాద్, పెదకాపు, గోపి , భవిత కేంద్ర ఐఈఆర్‌టీ పొడూరి ఆదర్శ తిరగటి వేణి, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లలు భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేట గౌతమి నగర్‌లో ఉన్న భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవోతో పాటు, ఎంపీడీవో నరేష్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యా సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, హెచ్ఎం సుభాష్, కేతా వెంకటేశ్వరరావు, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): ఊబలంక మదర్‌థెరిసా ఆశ్రమంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆశ్రమంలో జరిగిన దివ్యాంగుల దినోత్సవంలో విక్టరీ సంస్థల అధినేత డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి పాల్గొని చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం వారికి చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత

ద్రాక్షారామ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అలింకో సంస్థ సమకూర్చిన ట్రై సైకిళ్లను ఎంపీపీ అంబటి భవానీ, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం పంపిణీ చేశారు. మంత్రి సుభాష్ కృషితో అలింకో సంస్థ దివ్యాంగులకు ట్రై సైకిళ్ల సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.శివ ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసి విత్తనాల వెంకట రమణ, కంచుమర్తి బాబూరావు, చిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక అకడమిక్ ఇనస్ట్రక్టర్‌కు దరఖాస్తు చేసుకోండి

రాయవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు తాత్కాలిక అకడమిక్ ఇనస్ట్రక్టర్‌ల నియామకానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని మండల విద్యాశాఖ అధికారి- 2 వై.సూర్యనారాయణ తెలిపారు. బుధవారం రాయవరంలో ఎంఈవో- 2మాట్లాడుతూ మాచవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న సోషల్ అకడమిక్ కోఆర్డినేటర్ ఉద్యోగానికి దరఖాస్తులు కోరుతున్నట్టు చెప్పారు. ఈ ఉద్యోగానికి బీఏ, బీఈడీ లేదా బీకాం పూర్తి చేసిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎంపికైన అభ్యర్థి ఈ ఏడాది డిసెంబరు 8 నుంచి వచ్చే ఏడాది జూన్ 7 వరకు మాత్రమే కాలపరిమితి ఉంటుందన్నారు. నెలకు రూ.12,500 చెల్లిస్తారని ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతోపాటు ప్రో ఫార్మాను కలిపి రాయవరం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిసెంబరు 5వ తేదీలోపు దరఖాస్తు అందజేయాలని ఎంఈవో కోరారు.



హుండీ ఆదాయం లెక్కింపు

కె.గంగవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ఛాయాసోమేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ ఆవరణలో లెక్కించగా, రూ.3,29,089 వచ్చింది. ఈ సంవత్సరం మార్చి 1 నుంచి బుధవారం వరకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. గత సంవత్సరం కంటే ఈసారి హుండీ ఆదాయం పెరిగిందని ఈవో భీమశంకరం తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, పప్పుల సాయిబాబు, చీకట్ల సోమేష్, పలు ఆలయాల నుంచి వచ్చిన దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాలుగా ఏర్పడటం ద్వారా ఆర్థికాభివృద్ధి

రావులపాలెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు సంఘాలుగా ఏర్పడి వారి పంటలను గిట్టుబాటు ధరకు అమ్ముకున్నప్పుడే ఆర్థికాభివృద్ధి చెందుతారని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ అన్నారు. గోపాలపురం రైతు సేవా కేంద్రంలో ఆత్మా ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రంగ రైతులకు పంటల సరళి, సాగు ప్రణాళిక విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

కొత్తపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేసి నూరుశాతం అమలు చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో షేక్ సలీంబాషా పేర్కొన్నారు. బుధవారం మోడేకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి పలు అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.హరిప్రసాద్, హెచ్ఎం వీఎస్ఆర్ మూర్తి, పీఈటీ కల్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి రైతులు బాసట

రావులపాలెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు ఆర్థికాభివృద్ధి చెందడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ యువ నాయకులు బండారు సంజీవ్ అన్నారు. దేవరపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. కొత్తపేట నియోజకవర్గంలో వరి, అరటి, కొబ్బరి, ప్రధాన పంటలుగా ఉన్నాయని వాటికి అనుసంధానంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. దీన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ యువనేత బండారు సంజీవ్